# సాక్షి కామారెడ్డి

శనివారం : 4 : జనవరి : 2025




## హమాలీల నిరసన

సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.

- 11లో ▸



## సైన్స్‌పై అవగాహన ఉండాలి

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 11లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.9 /8.0

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### 7వ తేదీ వరకే సోయాబీన్ కొనుగోళ్లు

కామారెడ్డి క్రైం : జిల్లాలోని 9 సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఈనెల 7 వ తేదీ వరకే కొనసాగుతాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 8,071 మంది రైతుల నుంచి 1,37,871 క్వింటాళ్ల సోయాలను సేకరించామని పేర్కొన్నారు. మిగిలిన రైతులు ఈనెల 7 వ తేదీలోగా పంటను తీసుకుని వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. 7వ తేదీ తర్వాత కొనుగోలు కేంద్రాలను మూసివేయనున్నట్లు తెలిపారు.

### మెట్లబావి సందర్శన



లింగంపేట : మండల కేంద్రంలోని నాగన్న గారి మెట్ల బావిని శుక్రవారం డీఆర్డీవో సురేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక అధికారులతో మాట్లాడారు. రోజూ ఎంత మంది పర్యాటకులు వస్తున్నారన్న వివరాలు తెలుసుకున్నారు. బావి పరిసరాల్లో నాటిన మొక్కలకు రోజూ నీళ్లు పోయాలని సూచించారు. అనంతరం సమీపంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. వర్మి కాంపోస్టు ఎరువుల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొర్పోల్ గ్రామంలో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసిన ఫ్లోర్‌మిల్ యూనిట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంపీవో మలహరి, సీసీలు స్వప్న, రాజు, నగేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'పోచారం' నీటి విడుదల

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు శనివారం నీటి విడుదలను ప్రారంభించనున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నీటి విడుదలను ప్రారంభిస్తారని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు ఈ రబీ సీజన్‌లో ప్రాజెక్టునీటిని 'ఏ' జోన్ భూములకు కేటాయించనున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 19.5 ఫీట్లతో 1.65 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోచారం ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీ ఒకటి నుంచి డిస్ట్రిబ్యూటరీ 44 వరకు ప్రాజెక్టు నీటిని ఐదు విడతలలో అందించనున్నారు. ప్రతి విడతలో 15 రోజులపాటు నీటిని విడుదల చేసి 10 రోజులపాటు నీటివిడుదలను నిలిపివేయనున్నారు.


### సదరం క్యాంపుల తేదీలు ఖరారు

కామారెడ్డి టౌన్: సదరం క్యాంపుల తేదీలను ఖరారు చేసినట్లు డీఆర్‌డీవో సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8, 22, 29 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం శిబిరాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్హులైనవారు మీసేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని, ఒరిజినల్ ఆధార్‌కార్డు, మెడికల్ రిపోర్టులతో శిబిరానికి రావాలని సూచించారు.

### 'మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి'



రామారెడ్డి: అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పని చేస్తోందని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రామారెడ్డి సబ్‌స్టేషన్‌లో అదనపు 33/11 కేవీ లైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోసానిపేట, మర్కల్ సబ్‌స్టేషన్‌లలో ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు ఈ లైన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ లైన్ రెడ్డిపేట 132/33 కేవీ, కామారెడ్డి 132/33 కేవీ సబ్ స్టేషన్‌లకు వారధిగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నరేష్ కుమార్, ఏఈ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



## సందె వేళలో.. ఎన్నెన్ని హొయలో..

సాయం సంధ్యా సమయం.. దినకరుడు పొద్దంతా వెలుగులు పంచి పశ్చిమ దిశకు వాలిపోతున్న వేళ.. ముసురుకున్న మబ్బులను చీల్చుకుంటూ సూర్య కిరణాలు పడమటి సంధ్యారాగాన్ని ఆలపించాయి. ఈ దృశ్యం శనివారం సాయంత్రం నాగిరెడ్డిపేట మండలంలో ఆవిష్కృతమైంది. సందె వేళలో ఆవిష్కృతమైన ప్రకృతి హొయలు చూపరులకు కనువిందు చేశాయి.

– నాగిరెడ్డిపేట

# అప్పుల్లో పంచాయతీ కార్యదర్శులు!

- పదకొండు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలు
- విడుదల కాని 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు
- ట్రాక్టర్లు, విద్యుత్ దీపాలు, బోర్ల నిర్వహణకు ఇబ్బందులు
- అప్పులు చేసి పనులు చేయిస్తున్నామంటున్న కార్యదర్శులు

**పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో** ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. పదకొండు నెలలుగా పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. నిధులు లేకపోవడంతో అప్పులు చేసి పనులు చేయిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 526 పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా మరో తొమ్మిది పంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటితో కలిపి పంచాయతీల సంఖ్య 535 కు చేరింది. కొన్ని పంచాయతీల్లో మాత్రమే ఆదాయ వనరులు ఉండగా, అత్యధిక పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. అరకొర పన్నులు వసూలైనా అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. మరోవైపు పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో భారమంతా కార్యదర్శుల పైనే పడుతోంది. ప్రత్యేకాధికారులు ఉన్నా వారు పర్యవేక్షించడమే తప్ప ఆర్థిక వ్యవహారాలను ఎవరూ తలమీద వేసుకోవడం లేదు. నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఆటోల నిర్వహణ, విద్యుత్ దీపాలు, బోరు మోటార్లు, పైపులైన్ల నిర్వహణ వంటి పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తోంది. నెల నెలా ఖర్చులన్నీ భరించడం భారంగా మారిందని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.లక్ష దాకా అప్పులు..**

చిన్నచిన్న పంచాయతీల్లో కనీసం రూ. 30 వేలపైనే కార్యదర్శులు సర్దుబాటు చేశారు. కొన్నిచోట్ల అయితే రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా అప్పులు చేశారు. నెలల తరబడిగా విద్యుత్ దీపాలు, బోరు మోటార్ల నిర్వహణ, పైపులైన్లు పగిలినా, స్టార్టర్లు దెబ్బతిన్నా కార్యదర్శులే చేయిస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్, మెయింటెనెన్స్‌కు డబ్బులు ఎక్కువగా ఖర్చవుతున్నాయి. చాలా గ్రామాల్లో నిధులు లేకపోవడంతో దెబ్బతిన్న వీధిలైట్లను మార్చడానికి ఇబ్బందులు పడుతున్నారు. మాస్ సానిటేషన్ చేయాల్సినపుడల్లా కూలీలకు డబ్బులు సర్దుబాటు చేయడం కార్యదర్శులకు భారంగా మారింది.

**నిధులొస్తేనే అప్పులు తీరేది..**

పంచాయతీ ఎన్నికలకన్నా ముందుగానే పెండింగ్‌లో ఉన్న నిధులు వస్తే తాము చేసిన అప్పులు తీర్చుకోగలుగుతామని పలువురు కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఏ పంచాయతీ కార్యదర్శిని కదిలించినా సొంత అవసరాల కన్నా పంచాయతీ అవసరాలకే ఎక్కువ అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులు వస్తే తప్ప గట్టెక్కలేమని పేర్కొంటున్నారు.

**నిధులు రాక..**

పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. పంచాయతీ పాలక వర్గాలు ఉంటే నిర్వహణ వ్యయం అంతా వాళ్లే చూసుకునేవారు. సర్పంచ్‌లు లేకపోవడంతో భారమంతా కార్యదర్శులపై పడింది. ప్రత్యేకాధికారులు ఎక్కడ కూడా ఆర్థిక వ్యవహారాలను పట్టించుకోవడం లేదు. దీంతో కార్యదర్శులే అన్నీ తామై వ్యవహరించాల్సి వస్తోంది. పదకొండు నెలలుగా నిధుల సమస్య వేధిస్తోంది. కొన్ని నిధులు విడుదలైనా ట్రెజరీల్లో చెల్లింపులు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఎలాంటి ఆదాయ వనరులు లేకపోవడంతో పంచాయతీ ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల మాత్రమే సర్దుబాటు అవుతున్నట్టు తెలుస్తోంది. మిగతా అన్నిచోట్ల అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు.

## సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

**కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: సావిత్రి బాయి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు విద్య అందించడానికి సావిత్రి బాయి పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వృద్ధాశ్రమ ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి**

వృద్ధాశ్రమాన్ని ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్మించిన వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. నీటి సరఫరాకు సంబంధించి బోరు నుంచి పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలన్నారు. భవనం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రాజన్న, మున్సిపల్ కమిషనర్ స్పందన, పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ రమేష్, సీడీపీవో రోచిష్మ, తహసీల్దార్ జనార్దన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ను వేగవంతం చేయాలి

మాచారెడ్డి: సీఎంఆర్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం పాల్వంచ మండలం భవానీపేట్ గ్రామంలోని గాయత్రి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం, సరఫరా చేయాల్సిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, తహసీల్దార్ లక్ష్మణ్ ఉన్నారు.

## బయటపడ్డ పురాతన శివలింగం



పెద్దకొడప్‌గల్‌లో బయటపడ్డ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని బోయవాడలో శుక్రవారం పురాతన శివలింగం బయటపడింది. గ్రామంలో పలువురికి శివలింగం రూపంలో రాయి కనిపించింది. దీంతో అనుమానం వచ్చి స్థానికులతో కలిసి బోయవాడలో తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో శివలింగం బయటపడింది. అనంతరం శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తెలవడంతో పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేస్తున్నారు. శివలింగం లభించిన ప్రాంతంలో గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మించడానికి కృషి చేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు.

## పూలే విగ్రహం వద్ద అక్షరాభ్యాసం



కామారెడ్డిలో పూలే దంపతుల విగ్రహాల వద్ద అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్దనున్న పూలే దంపతుల విగ్రహాల ముందు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బహుజన సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏటా సావిత్రిబాయి పూలే జయంతి రోజున సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలని నిర్ణయించారు. సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్, న్యాయవాది క్యాతం సిద్దరాములు, బామ్‌సెఫ్ రాష్ట్ర కార్యదర్శి నరేందర్, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు, జిల్లా అధ్యక్షుడు గంగారాం, వివిధ సంఘాల నేతలు ఎల్ఎన్ ఆజాద్, జీవీఎం విఠల్, అరవింద్, ముదాం అరుణ్, శివరాములు, రాజయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**హర్షణీయం..**

సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతేడాది ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

# విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

- నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ
- బెటాలియన్‌లో ఘనంగా దీక్షాంత్ పరేడ్
- శిక్షణ పూర్తి చేసుకున్న 463 మంది కానిస్టేబుళ్లు



మాట్లాడుతున్న సింధు శర్మ



ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్లు

డిచ్‌పల్లి: పోలీసు విధుల్లో క్రమశిక్షణ ముఖ్యమని నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ అన్నారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 463 మంది కానిస్టేబుళ్లకు శుక్రవారం 'దీక్షాంత్ పరేడ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ ఫైరర్ (జి.శివకృష్ణ), బెస్ట్ అవుట్ డోర్ అండ్ ఆల్‌రౌండర్ (బి.రవి), బెస్ట్ ఇండోర్ (కె.నవీన్‌కుమార్ రెడ్డి), పరేడ్ కమాండర్ (జి.నిరంజన్‌రెడ్డి)లకు కమాండెంట్ సత్యనారాయణతో కలిసి బహుమతులు అందజేశారు. శిక్షణ అందించిన పోలీసు, వైద్య సిబ్బందికి ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సింధుశర్మ మాట్లాడుతూ అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు సేవలో ప్రతిఒక్కరూ అంతర్భాగమేనని, వ్యవస్థలో విజయం సాధించాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లలో రాచకొండ కమిషనరేట్, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. కమాండెంట్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ 2002 లో బెటాలియన్ ట్రెనింగ్ సెంటర్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేయడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం అసిస్టెంట్ కమాండెంట్ కేపీ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆర్ఐ త్రిముఖ్ ఆధ్వర్యంలో 53 మంది అవుట్‌డోర్, ఆరు గురు ఇండోర్ ఫ్యాకల్టీ శిక్షణనిచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు ఇన్‌చార్జి సీపీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ కేపీ శరత్ కుమార్, కేపీ సత్యనారాయణ, ఏవో అయ్యవారయ్య, మెడికల్ ఆఫీసర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం'



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం 25వ రోజు సమ్మె శిబిరాన్ని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా చూడాలని కోరారు. సమ్మెకు జిల్లా ఉపాధ్యాయుల ఐక్యవేదిక అధ్యక్షుడు ప్రవీణ్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు లింగం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, సంగయ్య, డీటీఎఫ్, టీపీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, అంబిర్ మనోహర్, కుశాల్, ఆకుల బాబు తదితరులు మద్దతు తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లను పరిశీలించాలని కామారెడ్డి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు క్యాతం సిద్దిరాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పందిరి రాజేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీహరి, సత్యం, యాదయ్య, అయ్యల సంతోష్ తదితరులు కోరారు. సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు సంపత్, రాములు, సంతోష్‌రెడ్డి, వనజ, కాళిదాస్, వీణ, మాధవి, శైలజ, సంధ్య, దినేష్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## నారుకు ట్యాంకర్‌తో నీరు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. నారు ఎండుతుండడంతో ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి అందిస్తున్నారు. గోపాల్‌పేటకు చెందిన లక్ష్మయ్య అనే రైతు పోచారం ప్రధాన కాలువ కింద వరి వేసేందుకు ఇప్పటికే నారు పోశాడు. అయితే ప్రాజెక్టునుంచి నీటిని విడుదల చేయకపోవడంతో నారు ఎండిపోతోంది. దీంతో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. కాగా శనివారం ప్రాజెక్టునుంచి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో తమ సాగునీటి కష్టాలు తీరుతాయని రైతు లక్ష్మయ్య 'సాక్షి'తో పేర్కొన్నాడు.

## క్లుప్తంగా

### అభినందనలు



**కామారెడ్డి అర్బన్:** రోల్ ప్లే కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయిలో 'నశ ముక్త్ భారత్' అంశంలో ప్రథమ స్థానం పొంది మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ప్రదర్శనకు వెళ్తున్న దేవునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సానియా, రేణుక, నాని, విక్టర్‌పాల్, హర్షవర్ధన్‌లను డీఈవో రాజు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని ఆయన సూచించారు. గైడ్ టీచర్ భవాని, హెడ్‌మాస్టర్ గంగాకిషన్ పాల్గొన్నారు.

### 'డబుల్' ఇళ్ల పట్టాల కోసం ధర్నా



**కామారెడ్డి టౌన్:** తమకు మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదని పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, దేవునిపల్లి, రామేశ్వర్‌పల్లిలో డబుల్ బెడ్‌రూం నివాసులు శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. గంటన్నర పాటు ఆందోళన చేశారు. కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, బాధితులతో మాట్లాడారు. రెండు రోజుల్లో వివరాలు సేకరించి వారం రోజుల్లో పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

### ఆదివాసి రాజకీయ శిక్షణ తరగతులకు నేతల ఎంపిక



**కామారెడ్డి టౌన్:** ఈ నెల 5 నుంచి 11 వరకు నాగార్జునసాగర్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ జాతీయ ఆదివాసి రాజకీయ శిక్షణ తరగతులకు జిల్లా నుంచి ముగ్గురు నాయకులను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శుక్రవారం తెలిపారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ రాథోడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేష్ నాయక్, బాన్సువాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ శిక్షణ తరగతులకు 250 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

# మరువలేని ఆనంద క్షణాలు

**డిచ్‌పల్లి:** రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో మూడు జిల్లాలకు చెందిన పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. పరేడ్‌ను తిలకించేందుకు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు హాజరయ్యారు. పరేడ్ ముగిసిన తర్వాత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో తమ జ్ఞావకాన్ని పదిలపర్చుకున్నారు. ఆ మధుర క్షణాలను మొబైల్ ఫోన్లలో బంధించారు. అలాగే పలువురు 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు.



బెటాలియన్‌లో ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తిచేసిన కానిస్టేబుళ్లు

### పోలీస్ ఉద్యోగం గర్వంగా ఉంది..

మొదటి ప్రయత్నంలోనే పోలీస్ ఉద్యోగం సాధించి విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు భార్య మౌనిక సహకారం మరువలేనిది. పోలీసుగా ప్రజలకు సేవలందించే అవకాశం కలిగింది.

– బండ ప్రదీప్‌గౌడ్, పెద్దమల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా



కవాతు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు



శిక్షణ ఇచ్చిన బెటాలియన్ సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జి సీపీ

### లక్ష్యం నెరవేరింది



మాది వ్యవసాయ కుటుంబం. బీటెక్ పూర్తిచేయగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేదే నా లక్ష్యం. కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాగానే ప్రిపేరై, పరీక్ష రాశాను. ఉద్యోగం సాధించి ఏఆర్ కానిస్టేబుల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నాను. దీంతో నా లక్ష్యం నెరవేరింది.

– సోమ్‌లాల్ నాయక్, దేవరకొండ, నల్గొండ

### తల్లిదండ్రులకు అండగా ఉంటా



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పోలీసు ఉద్యోగం సాధించాను. మా అమ్మానాన్న బాబయ్య, లక్ష్మమ్మలకు అండగా ఉంటాను. పోలీసు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నాను. అంకితభావం, నీతినిజాయితీతో విధులు నిర్వర్తిస్తాను.

– ఈ.మహేష్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి

### సంతోషంగా ఉంది



పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన అనంతరం బెటాలియన్‌లో ఇచ్చిన శిక్షణలో బెస్ట్ అవుట్‌డోర్, ఆల్‌రౌండర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. మా అమ్మా, నాన్న వ్యవసాయం చేసి మమ్మల్ని చదివించారు. పోలీసుగా ప్రజలకు సేవచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– బి.రవి, ముదేటిపల్లి తండా, మహబూబ్‌నగర్

### ముడుపు విప్పేందుకు రండి

- సీఎం రేవంత్‌రెడ్డిని ఏర్గట్లకు ఆహ్వానించిన కాంగ్రెస్ నాయకులు



**మోర్తాడ్:** ఏర్గట్ల మండల కేంద్రంలో ప్రచా రం చేసిన సందర్భంలో రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ముడుపు కట్టామని, దానిని విప్పడానికి రావాలని కాంగ్రెస్ నేతలు ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం బా ల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివ న్నోల్ల శివకుమార్ ఆయనను కలిశారు. అప్పట్లో ముడుపు కట్టిన వివరాలు, పత్రికలలో వచ్చిన క్లిప్పింగ్‌లను సీఎంకు చూపించారు. గతంలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్గట్లలో ప్రచారం చేసి సీఎం అయ్యారని, అదే బాటలో రేవంత్‌రెడ్డి కూడా సీఎంగా ఎంపికైన సెంటిమెంట్ అంశాన్ని ప్రస్తావించామని శివకుమార్ చెప్పారు. ఏర్గట్ల పర్యటన అంశం పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు శివకుమార్ తెలిపారు. ముణిమానిక్యం అజయ్ పాల్గొన్నారు.

### ధర్పల్లి హెచ్‌ఎంపై విచారణ

**నిజామాబాద్ అర్బన్:** ధర్పల్లి ఉన్నత పాఠ శాల హెచ్‌ఎంపై శుక్రవారం నిజామాబాద్ రూరల్ మండల విద్యాశాఖ అధికారి సేవ్లా విచారణ చేపట్టారు. పాఠశాలలో టీచర్ల మధ్య విభేదాలు ఉన్నాయి. అలాగే గ్రామ స్తులు సైతం హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీడీ ఆదేశాల మేరకు ఆయన పాఠశాలలో విచారణ చేపట్టారు.

### ఆదర్శ పాఠశాల తనిఖీ

**సిరికొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ప్యానెల్ టీం సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా నోడల్ అధికారి ప్రవీణ్ విద్యార్థులకు బోధిస్తున్న తీరును, రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పూలే జయంతి సందర్భంగా మహిళా టీచర్లను సన్మానించారు.

## గురుకులాల సమస్యలను పరిష్కరించండి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

**కామారెడ్డి టౌన్:** ప్రభుత్వ గురుకుల సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఏవో మన్సూర్ రహమత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రత్యూషరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో గడిచిన ఏడాది కాలంలో వసతి గృహాలలో 38 సార్లు ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగి 51 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అయినా కాంగ్రెస్ సర్కార్‌కు, అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు కనీసం మరమ్మతులు చేయించాలన్నారు. పట్టణ కార్యదర్శి సంతోష్, నాయకులు సమీర్, మానస, సంజన, నవ్యశ్రీ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు నూతన తరం సృష్టికర్తలు

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



ఉప్పల్‌వాయిలో మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అనిల్ కుమార్

**రామారెడ్డి:** ఉపాధ్యాయులు నూతన తరం సృష్టికర్తలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉప్పల్‌వాయి పాఠశాలలో సావిత్రీబాయి పూలె జయంతి సందర్భంగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో నిట్టు ఆనంద్ రావు, టీపీటీఎఫ్ కామారెడ్డి అధ్యక్షుడు చింతల లింగం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

**ఎల్లారెడ్డిరూరల్:** ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థులకు అందిస్తున్న కిరాణా వస్తువులు, వండిన వంటను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వార్డెన్ శారద తదితరులున్నారు.

**బిచ్కుందలో..**

**బిచ్కుంద(జుక్కల్):** మండల కేంద్రంలోని బాలుర బీసీ హాస్టల్‌ను తహసీల్దార్ సురేశ్ తనిఖీ చేశారు. సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైపు వద్ద బిగించిన కంట్రోలింగ్ వాల్ లీకేజీ వల్ల నీరు కలుషితం అవుతున్నాయని వార్డెన్ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగునీరు విద్యార్థులకు అందించాలని పంచాయతీ కార్యదర్శిని ఈ సందర్భంగా తహసీల్దార్ ఆదేశించారు.



సరుకులు పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీవో ప్రకాష్

**విద్యార్థులతో కలిసి భోజనం..**

**ఎల్లారెడ్డిరూరల్:** ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎంపీడీవో ప్రకాష్ భోజనం చేశారు. శుక్రవారం పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

**లింగంపేటలో..**

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల కళాశాలను శుక్రవారం తహసీల్దార్ నరేందర్‌గౌడ్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆర్‌ఎల్‌సీ కిరణ్ కుమార్‌గౌడ్‌తో కలిసి రికార్డులు, విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించారు. వారి వెంట ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

### కేజీబీవీలను పర్యవేక్షిస్తున్న విద్యా శాఖాధికారులు



**నిజాంసాగర్(జుక్కల్):** సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో కేజీబీవీలలో విధులను విద్యా శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ ఉద్యోగులు, సీఆర్పీలు సమ్మెలో ఉండటంతో ఎంఈవోలపై భారం మోపారు. నిజాంసాగర్ కేజీబీవీలో నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల విద్యా శాఖాధికారులు విధులు నిర్వహిస్తున్నారు. బాలికల వసతి గృహంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల మహిళ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. భోజన ఏర్పాట్లు కూడా చూస్తున్నారు.

**లింగంపేటలో..**



**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఎంఈవో షౌకత్‌అలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా బాలికల సిబ్బంది సమ్మెలో ఉండడంతో నలుగురు ఉపాధ్యాయురాళ్లను, రాత్రి వేళ లేడీ కానిస్టేబుల్‌ను ఉంచినట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించి భోజన వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని సూచించారు.

### ఒకరి ఆత్మహత్య

**పిట్లం(జుక్కల్)/బాన్సువాడ రూరల్:** బాన్సువాడ డివిజన్‌లోని బుడిమి గ్రామానికి చెందిన మ్యాతరి సాయిలు (57) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సాయిలుకు కొంత కాలంగా తన ఆరోగ్యం బాగుండటం లేదు. ఈక్రమంలో శుక్రవారం అతడు బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీరా బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం అవుతోంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



## క్రైం కార్నర్

### మహిళ దారుణ హత్య

**ఖలీల్‌వాడి:** సారంగపూర్‌లోని వడ్డెరకాలనీకి చెందిన దుబ్బాక సాయమ్మ(68)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఆరోటౌన్ ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. వడ్డెరకాలనీలో సాయమ్మ ఒంటరిగా నివాసం ఉంటుంది. భర్త కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం సాయమ్మను హత్య చేసినట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు

**కామారెడ్డి క్రైం:** భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా.. లింగంపేట మండలం సూరాయిపల్లి తండాకు చెందిన రమావత్ విజయ (28) 2021 ఫిబ్రవరి 28న హత్యకు గురైంది. ఆమె అన్న మలావత్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లింగంపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. మృతురాలి భర్త రమేష్ తరచూ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించేవాడనీ, హత్య జరిగిన రోజు ఆమెను తీవ్రంగా కొట్టడంతోనే చనిపోయినట్లు విచారణలో తేలింది. దీంతో రమేష్‌ను అరెస్ట్ చేయగా అప్పటి నుంచి కోర్టు విచారణ జరిగింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్ ఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

### షెడ్డు ధ్వంసం కేసులో 9మంది రిమాండ్

**కామారెడ్డి క్రైం:** చర్చికి సంబంధించిన రేకుల షెడ్డును ధ్వంసం చేసిన విషయంలో 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో ప్రార్థనలు చేయడానికి ఇటీవల ఓ చోట చర్చి నిర్మించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రెండు రోజుల క్రితం చర్చిని ధ్వంసం చేశారు. చర్చి ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో గ్రామానికి చెందిన 9మందిపై కేసు నమోదు చేసి రిమండ్‌కు పంపామన్నారు.

## ఏడాదికి వెలుగు చూసిన హత్య

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన వైనం
- రైలు ప్రమాదంగా నమ్మించేందుకు యత్నం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో విచారణ.. నిందితుల రిమాండ్

**ఎడపల్లి(బోధన్):** వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసిందో భార్య. అనంతరం మృతదేహాన్ని పట్టాలపై పడుకోబెట్టి రైలు ప్రమాదంగా నమ్మించేందుకు యత్నించింది. ఏడాది క్రితం జరిగిన ఈ హత్య కేసులో తాజాగా పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన దుడ్డు సాయిలు 2024 జనవరి 8న రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి, వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా సాయిలు భార్య చంద్రకళకు రాజలింగం అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయమై సాయిలు భార్యను మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. జైతాపూర్‌కు చెందిన రాజలింగం, స్వరూప, బాపూనగర్‌కు చెందిన మనోజ్ సాయంతో హత్యకు ప్లాన్ వేసింది. దీంతో నలుగురు కలిసి దావత్ అని పిలిచి సాయిలును హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని పట్టాలపై పడుకోబెట్టారు. రైలు మృతదేహం పైనుంచి వెళ్లే వరకు అక్కడే ఉండి ఇంటికి చేరుకున్నారు. విచారణ చేపట్టగా నిందితులు నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

# వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని** పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో పలువురు మృతిచెందారు. నందిపేట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, బాల్కొండ మండలంలో ఒకరు, డిచ్‌పల్లి మండలంలో ఒకరు మృత్యువాతపడ్డారు. అలాగే చెరువులో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు మరణించారు.

**బాల్కొండ:** మండలంలోని బస్సాపూర్ శివారులోగల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన భీమనొల్ల ప్రమీల(40) భర్తతో కలిసి బైక్‌పై బస్సాపూర్ వస్తుండగా వారిని బస్సాపూర్ శివారులో వెనుక నుంచి వేగంగా వచ్చిన స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినదని వైద్యులు పేర్కొన్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో..**

**డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం (బి) గ్రామం వద్ద రహదారిపై వేగంగా వెళ్తున్న బైక్‌కు కుక్క అడ్డురావడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భర్తకు తీవ్ర గాయాలు కాగా, భార్య మృతిచెందింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నడిపోల్ల సుబ్బయ్య తన భార్య లత (34)తో కలిసి బైక్‌పై నిజామాబాద్‌కు వెళుతున్నాడు. ధర్మారం(బి) గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో వీరి బైక్‌కు ఒక కుక్క అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయి ఇద్దరూ కిందపడిపోయారు. ఈప్రమాదంలో లతకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతి చెందింది. మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కారు ఢీకొని వ్యవసాయ కూలి..



ప్రమాదానికి కారణమైన కారు

**నందిపేట్(ఆర్మూర్):** నందిపేట్ మండల కేంద్రంలోని పలుగుట్ట సమీపంలో కారు ఢీకొనడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూర్ జిల్లాకు చెందిన కొత్తపల్లి నాని అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యవసాయ కూలి పనుల నిమిత్తం నాని 20 రోజుల క్రితం బాద్గుణ గ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి కేదారీశ్వర ఆశ్రమంలో భోజనం చేసి నడుచుకుంటూ నందిపేటకు బయలుదేరాడు. ఇరిగేషన్ గెస్టుహౌజ్ వద్ద నానిని ఓ కారు వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారును డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నందిపేటకు చెందిన బుడ్డ శివ కారుగా పోలీసులు గుర్తించారు. అతడే అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని తేల్చారు. కారును స్టేషన్‌కు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

### చికిత్స పొందుతూ యువతి..

**బీబీపేట:** ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందింది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన నిజ్జని స్నేహ (22) హైదరాబాద్‌లో ఉంటూ అగ్రికల్చర్ బీఎస్సీ చదివుతుంది. గత కొంతకాలంగా జాండీస్‌తో బాధపడుతూ ఉండేది. గత నెల 26న బీబీపేటకు వచ్చిన ఆమె గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందిందన్నారు. మృతురాలి నానమ్మ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### వైరస్ కారణంగానే కోళ్ల మృతి?



**డొంకేశ్వర్(ఆర్మూర్):** మండలంలోని గంగాసముందర్‌లో మూడు రోజుల క్రితం యాభైకి పైగా నాటు కోళ్లు, ఒక మేక పిల్లల మృతి చెందిన ఘనటపై మండల పశువైద్య అధికారి శ్రీకాంత్ శుక్రవారం విచారణ జరిపారు. గ్రామానికి వెళ్లి కోళ్ల పెంపకందార్లతో మాట్లాడి, చనిపోయిన కోళ్లను పరిశీలించారు. మొదటి రోజే కాకుండా మరుసటి రోజు కూడా నాలుగైదు కోళ్లు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. చనిపోయిన కోళ్ల నుంచి శాంపిళ్లను సేకరించి నిజామాబాద్ పశువైద్య ల్యాబ్‌కు పంపించామని అధికారి పేర్కొన్నారు. వాటి మరణానికి విషాహారమేనని కచ్చితంగా చెప్పలేమని, నిమోనియా లాంటి వైరస్ సోకడం వలనే మరణించి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇంకా అనుమానం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేసి పెంపకందారులే స్వయంగా కోళ్ల శాంపిళ్లను హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఐతే, బాధిత వ్యక్తులు మాత్రం తమ కోళ్లపై విష ప్రయోగం జరిగిందని ఆరోపిస్తున్నారు.

### ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మహిళ..



అన్సి(ఫైల్)

**ఎల్లారెడ్డి:** ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని రాంపూర్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. రాంపూర్ తండాకు చెందిన మెగావత్ అన్సీ (42) ఆవులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లగా దాహం తీర్చుకునేందుకు చెరువులో దిగి నీటిని తాగుతుండగా కాలు జారి పడిపోయింది. దీంతో నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బహిర్భూమికి వెళ్లి ఒకరు..**

**మాచారెడ్డి:** పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గోదూరి బాలయ్య(66) గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లగా, బండారి చెరువులో శుక్రవారం శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### కంటెయినర్‌లో చెలరేగిన మంటలు



**కామారెడ్డి క్రైం:** టేక్రియాల్ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై పాత ఎలక్ట్రానిక్ వస్తువుల లోడ్‌తో వెళ్తున్న ఓ కంటెయినర్‌లో శుక్రవారం వేకువజామున ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సదరు కంటెయినర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళుతున్నట్లు తెలిసింది. మంటలు చెలరేగగానే డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపారు. పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో బంక్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకసిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. కంటెయినర్‌తో పాటు అందులో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.8లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు భావిస్తున్నారు.